క్లుప్తంగా

పీఎంపీలకు వైద్య విజ్ఞాన అవగాహన సదస్సు

కంబాలచెరువు: కమ్యూనిటీ **పారామెడిక్స్** ప్రైమరీ హెల్త్ కేర్ ప్రొవైడర్స్ వె**ల్ఫేర్ అసోసియే**షన్ రాజానగరం, రంగంపేట మ**ండలాల ఆధ్వ**ర్యంలో రాజమహేంద్రవరంలో ఆదివారం మండల అధ్యక్షుడు బుడ్డిగ అప్పారావు అధ్యక్షతన వైద్య విజ్ఞాన అవగాహన సదస్సు జరిగింది. వైద్యులు డాక్టర్ టి.స్వరూప్ మాట్లాడుతూ శస్త్ర చికిత్సలలో నూతన విధానాలపై అవగాహన కల్పించారు. గాల్‌బ్లేడర్‌లో రాళ్లు, అపెండిసైటిస్, ప్యాంక్రెటీస్ వంటి రుగ్మతలకు లాప్రోస్కోపిక్ సర్జరీల సేవలు ఎనలేనివన్నారు. వెరికోసిస్ రుగ్మతలో చేసే లేజర్ సర్జరీ గురించి వివరించారు. డాక్టర్ తోట సాయి స్మరణ్, జిల్లా అధ్యక్షుడు బళ్లా శ్రీనివాసరావు, జిల్లా కార్యదర్శి పి.దేవానందం, మండల కార్యదర్శి కాపా సత్యనారాయణ, కోశాధికారి ఏ.నాగేశ్వరరావు, డి.గోపి, డి.వీర్రాజు, చంద్రశేఖర్, ఎం.వెంకన్న, కె.సత్తిబాబు పాల్గొన్నారు.

నేడు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్ పర్యటన



విలేకరులతో మాట్లాడుతున్న సోము వీర్రాజు, రామకృష్ణారెడ్డి, పిక్కి నాగేంద్ర

రాజమహేంద్రవరం సిటీ: బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ సోమవారం రాజమహేంద్రవరంలో పర్యటిస్తున్నట్టు బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు, ఎమ్మెల్సీ సోము వీర్రాజు, అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు పిక్కి నాగేంద్ర కోరారు. ఆదివారం క్వారీ ఏరియాలోని జిల్లా బీజేపీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ మాధవ్ సోమవారం ఉదయం నగరంలోని ఒక ఆర్‌ఎస్‌ఎస్ శాఖను సందర్శించి ప్రముఖులను కలుస్తారన్నారు. అనంతరం ఏడున్నర గంటలకు హేపీ స్ట్రీట్‌లో ప్రజలతో చాయ్ పే చర్చా కార్యక్రమం ఉంటుందన్నారు. అనంతరం వై.జంక్షన్ సర్దార్ గౌతు లచ్చన్న విగ్రహం దగ్గర నుంచి శోభాయాత్ర ప్రారంభమై, సుబ్రహ్మణ్య మైదానానికి చేరుతుందని, అక్కడ జరిగే బహిరంగ సభలో మాధవ్ ప్రసంగిస్తారని తెలిపారు.

కాతేరులో సమావేశం

రాజమహేంద్రవరం రూరల్: కాతేరు గ్రామంలో కార్యకర్తలు, స్థానికులతో సోమువీర్రాజు సమావేశం నిర్వహించారు. మాధవ్ పాల్గొనే కార్యక్రమంపై దిశానిర్దేశం చేశారు. మండల అధ్యక్షుడు నాగల శివ తదితరులు పాల్గొన్నారు.

తెలుగు ఉపాధ్యాయినికి జాతీయ పురస్కారం

రంగంపేట: తమ పాఠశాలకు చెందిన తెలుగు భాష ఉపాధ్యాయిని డాక్టర్ శ్రీపాద సీతామహాలక్ష్మి 'గిడుగు' జాతీయ పురస్కారానికి ఎంపికైనట్టు స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వి.పార్థసారథి తెలిపారు. సీతామహాలక్ష్మి రచించిన సాయి లీలామృతం హైదరాబాద్‌కు చెందిన గిడుగు రామమూర్తి పంతులు ఫౌండేషన్‌లో పరిశోధన జరిగిందని, అనంతరం జాతీయ పురస్కారానికి అర్హత సాధించారన్నారు. నేడు హైదరాబాద్ రవీంద్ర భారతిలో నిర్వహించే గిడుగు జయంతి వేడుకలలో పరిశోధన విభాగంలో జాతీయ పురస్కారాన్ని సీతామహాలక్ష్మి అందుకుంటారని తెలిపారు.

బీసీ, ఎస్సీ, ఎస్టీల అభివృద్ధికి కృషి

పెదపూడి: బీసీ, ఎస్సీ, ఎస్టీల అభివృద్ధికి అందరు ఐక్యతగా ముందుకు సాగాలని రాష్ట్ర 93 బీసీ కులాల అధ్యక్షుడు మాకిరెడ్డి భాస్కర్ గణేష్‌బాబు అన్నారు. గండ్రేడు గ్రామంలో ఉమమహేశ్వర రజక సంఘం ఆధ్వర్యంలో ఆదివారం 'వనమహోత్సం' మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి బీసీ, ఎస్సీ, ఎస్టీ, ప్రజా సంఘాల రాష్ట్ర నాయకులు, భాస్కర్ గణేష్‌బాబు, మాల మహానాడు రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు సిద్ధాంతుల కొండబాబు, రాష్ట్ర రజక కార్పొరేషన్ డైరెక్టర్ అల్లం వెంకటదాన మెంటారావు, నియోజకవర్గం రజక చైతన్య సేవా సంఘం కన్వీనర్ మురమళ్ల వెంకటరమణ, ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకుడు మందపల్లి సత్యనారాయణ, సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా నాయకుడు గుబ్బల ఆదినారాయణ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ముందుగా డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, కాటన్‌దొర, దివంగత మాజీ సీఎం ఎన్టీ రామారావు విగ్రహాలకు, చాకలి ఐలమ్మ, గాడ్సేబాబా చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం గ్రామంలో మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. అనంతరం ఉమామహేశ్వర రజక సంఘం కార్యాలయం ప్రారంభించారు.

సినిమాలు

శ్యామల	: సుందరకాండ
సూర్యమినీ	: మహావతార్ నరసింహ
సూర్యప్యాలెస్	: సుందరకాండ
స్వామి	: కూలీ
అనుశ్రీ	: కూలీ
శివజ్యోతి	: బకాసుర రెస్టారెంట్
రాజా	: సుందరకాండ
ఊర్వశి	: కూలీ
మేనక	: సుభ్రంసో
రంభ	: మహావతార్ నరసింహ
అప్సర	: వార్-2
అశోక	: వార్-2
నామవరం	
వీఎస్.మహల్	: కూలీ
ధవళేశ్వరం	
మురళీకృష్ణ	:కూలీ, మహావతార్ నరసింహ
కడియం	
వెంకటసూర్య	: కూలీ

గణేశ్ నిమజ్జనానికి సర్వం సిద్ధం

- ఈ నెల 6 వరకూ ఏర్పాట్లు
- మూడు షిఫ్టుల్లో పారిశుధ్య కార్మికులు

రాజమహేంద్రవరం సిటీ: గణపతి నవరాత్ర ఉత్సవాల సందర్భంగా విగ్రహాల నిమజ్జనోత్సవ కార్యక్రమానికి నగర పాలక సంస్థ సర్వం సిద్ధం చేసింది. ఆదివారం నుంచి భారీగా ప్రారంభమైన నిమజ్జనోత్సవాలకు సంబంధించి గోదావరి నదిలో మార్కండేయ ఘాట్ సమీపంలోని హెడ్ వాటర్ వర్క్స్ ఇసుక ర్యాంపు వద్ద పెద్ద ఎత్తున ఏర్పాట్లు చేశారు. రేవులో వినాయక విగ్రహాలను గోదావరిలో నిమజ్జనం చేసేందుకు లాంచీతో పాటు గోదావరిలో ప్రత్యేక పంటు, విగ్రహాలను తరలించేందుకు భారీ క్రేన్ ఏర్పాటు చేశారు. ఉదయం నుంచి రాత్రి వరకూ మూడు షిఫ్టుల్లో సేవలు అందించేందుకు 40 మంది పారిశుధ్య కార్మికులను నియమించారు. నిమజ్జన సమయంలో ఏవిధమైన ఇబ్బందులు తలెత్తకుండా పోలీస్, రెవెన్యూ, ఆరోగ్యశాఖ నగరపాలక సంస్థ అధికారులు సంయుక్తంగా పర్యవేక్షిస్తున్నారు. ఈ ఏడాది రాజమహేంద్రవరం నగరంలోని విగ్రహాలతో పాటు, చుట్టుపక్కల గ్రామాలకు చెందిన సుమారు 1,500 విగ్రహాలు నిమజ్జనానికి తరలి వస్తాయని నగర పాలక సంస్థ అధికారులు అంచనా వేస్తున్నారు.

బారికేడ్ల ఏర్పాటు

వినాయక విగ్రహాల నిమజ్జనోత్సవాన్ని తిలకించేందుకు గోదావరి రేవుకు తరలివచ్చే సందర్శకులకు అనుగుణంగా నగర పాలక సంస్థ ఏర్పాట్లు చేసింది. ఏవిధమైన ఇబ్బందులు తలెత్తకుండా బారికేడ్లు ఏర్పాటు చేశారు. రాత్రి సమయంలో చూసేందుకు ఫ్లడ్ లైట్లు ఏర్పాటు చేశారు. నిమజ్జనోత్సవానికి తరలి వచ్చే భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని పోలీస్ సిబ్బందితో పికెట్ ఏర్పాటు చేశారు.



వినాయక నిమజ్జనాలకు గోదావరి నదిలో ఏర్పాటు చేసిన ప్రత్యేక లాంచీ, పంటు

మెడికల్ క్యాంప్ ఏర్పాటు

నిమజ్జనాలకు వచ్చే భక్తులకు అవసరమైతే ప్రాథమిక వైద్య సేవలు అందించేందుకు మెడికల్ క్యాంప్ ఏర్పాటు చేశారు. దీంతోపాటు ఉదయం నుంచి రాత్రి వరకూ అంబులెన్స్‌ను సిద్ధంగా ఉంచారు. ఉదయం నుంచి రాత్రి వరకూ ఇసుక ర్యాంప్ వద్ద వైద్యసేవలు అందించేందుకు మెడికల్ సిబ్బందిని సిద్ధం చేశారు. నిమజ్జనోత్సవాలకు తరలివచ్చే భక్తుల దాహార్తి తీర్చేందుకు నగర పాలక సంస్థ మంచినీటి సరఫరా ఏర్పాటు చేసింది. దూర ప్రాంతాల నుంచి వచ్చే భక్తుల కోసం ఏవిధమైన ఇబ్బందులు తలెత్తకుండా అన్ని విధాల ఏర్పాట్లు చేసినట్లు అధికారులు తెలిపారు.

40 మంది పారిశుధ్య కార్మికుల సేవలు

వినాయక నిమజ్జనత్సోవాలకు 40 మంది పారిశుధ్య కార్మికులను ఏ,బీ,సీలుగా మూడు షిప్టుల్లో సిద్ధం చేశాం. భారీ క్రేను, పంటు, లాంచీతో పాటు గజఈత గాళ్లను సిద్ధంగా ఉంచాం. భక్తులు తీసుకుని వచ్చే పూజా సామగ్రిని గోదావరిలో కలపకుండా ప్రత్యేక చర్యలు చేపట్టాం. నిమజ్జన సమయంలో గోదావరి నదిలో ఎవరూ దిగకుండా నిషేధ ఆజ్ఞలు విధించాం. ఏవిధమైన అవాంఛనీయ ఘటనలు జరగకుండా ముందస్తు జాగ్రత్త చర్యలు కట్టుదిట్టంగా అమలు చేస్తున్నాం. ఈ నెల 6వ తేదీ వరకూ నిమజ్జనాలకు వచ్చే విగ్రహాల కోసం సిబ్బంది సిద్ధంగా ఉండేలా చర్యలు చేపట్టాం.

–ఐ.శ్రీనివాస్, శానిటరీ సూపర్ వైజర్, నగరపాలక సంస్థ



వినాయక విగ్రహాలను పంటుపైకి తరలిస్తున్న కార్మికులు



భక్తులను నియంత్రించేందుకు ఏర్పాటు చేసిన బారికేడ్లు

చట్టాలపై అవగాహన పెంచుకోండి



సదస్సులో మాట్లాడుతున్న న్యాయమూర్తి బాబు

కడియం: విద్యార్థులు చదువుతోపాటు చట్టాలపై అవగాహన పెంచుకోవాలని రాజమహేంద్రవరం ఏడవ అడిషనల్ జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ పి.బాబు అన్నారు. మురమండలోని శ్రీ పిచ్చుగ కోటయ్య ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రిన్సిపాల్ శ్రీ బీకే రామచౌదరి అధ్యక్షతన బాల్యవివాహాలు, చైల్డ్ అట్రాసిటీస్ అంశంపై అవగాహన సదస్సు నిర్వహించారు. న్యాయమూర్తి బాబు ముఖ్యఅతిథిగా పాల్గొని బాల్య వివాహాలు చేసుకుంటే కలిగే దుష్పరిణామాలపై అవగాహన కల్పించారు. కడియం ఎస్సై దుర్గాప్రసాద్, కళాశాల అధ్యాపకుడు మార్రెళ్ల విజయ కుమార్ పాల్గొన్నారు.

ధర్మేష్‌కు తెలుగు తేజం అవార్డు



ధర్మేష్‌ను సన్మానించి, అవార్డును అందిస్తున్న శ్రీకళావేదిక చైర్మన్ డాక్టర్ ప్రతాప్ తదితరులు

సీతానగరం: బొబ్బిల్లంకకు చెందిన యువ కవి, విద్యా, సామాజిక సంస్కర్త నక్కిన ధర్మేష్ తెలుగు తేజం పురస్కారం ఆదివారం అందుకున్నారు. పల్నాడు జిల్లా నరసారావుపేటలో భువనచంద్ర టౌన్ హాల్లో ధర్మేష్‌కు అంతర్జాతీయ సాంస్కృతి సంస్థ శ్రీశ్రీ కళావేదిక చైర్మన్ డాక్టర్ కత్తిమండ ప్రతాప్, జాతీయ అధ్యక్షుడు ఈశ్వరీ భూషణం, ప్రాచీన కవుల వారసులు, ప్రముఖులు సమక్షంలో తెలుగు తేజం అవార్డును గజమాల, జ్ఞాపిక, అవార్డు పత్రంతో ఘనంగా సత్కరించారు. ప్రతి ఏటా అంతర్జాతీయ సాంస్కృతిక సంస్థ శ్రీశ్రీ కళావేదిక అందించే అత్యంత ప్రతిష్టాత్మక పురస్కారాన్ని తెలుగు సాహిత్యంలో విశేష కృషి చేస్తున్న ప్రతిభావంతులకు ప్రదానం చేస్తారు. ఈ అవార్డు ధర్మేష్ అందుకోవడం ఎంతో సంతోషంగా ఉందని వైఎస్సార్ సీపీ సర్పంచ్ మెల్లిమి రామచంద్రరావు, గ్రామ పెద్దలు, కవులు, సాహితీవేత్తలు అన్నారు. ధర్మేష్ మాట్లాడుతూ ఈ పురస్కారం నా బాధ్యత మరింతగా పెంచిందని, అమ్మ భాష తెలుగు అక్షరమై వెలగాలి, తెలుగు భాషా పరిరక్షణకు, అభివృద్ధికి మరింత కృషి చేస్తానని తెలిపారు.

తెలుగు సాహితీ వనంలో చెరగని ముద్ర ఆరుద్ర

సీటీఆర్ఐ: తెలుగు సాహితీ వనంలోనూ, సినిమా రంగంలోనూ ఆరుద్ర ముద్ర చెరిగిపోనిది అని మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా అన్నారు. తెలుగు సారస్వత పరిషత్, కళా గౌతమి ఆధ్వర్యంలో గౌతమ ఘాట్లో ఆదివారం ఆరుద్ర శత జయంత్యుత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఆరుద్ర చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా జక్కంపూడి విజయలక్ష్మి మాట్లాడుతూ కవిగా, రచయితగా, పరిశోధకునిగా, నాటక కర్తగా, విమర్శకునిగా ఆరుద్ర సాగిన తీరు అనితర సాధ్యమన్నారు. చిత్రసీమలో ఆరుద్ర పాటలు, మాటలు జనాన్ని ఎంతగానో మురిపించాయని తెలిపారు. తెలుగు శాఖాధిపతి డాక్టర్ పీవీబీ సంజీవరావు మాట్లాడుతూ వేదంలా ఘోషించే గోదావరి పాటతోనే ఆరుద్ర రాజమహేంద్రవరం ప్రజల మనసులో స్థిర స్థానం సంపాదించుకున్నారన్నారు. ఆయన పరిశోధనాత్మక సాహిత్యమంతా తిరిగి పునరుద్ధరణ చేయాలని అందుకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని కోరారు. ఆరుద్ర రాసిన గీతాన్ని పిచ్చుకల సత్యనారాయణ ఆలపించారు. చల్లా శంకరరావు, మంతెన కేశవరాజు, ఇమ్మంది మోహనరావు, దేశిరెడ్డి బలరామనాయుడు, చీర్ల సీతారామనాయుడు పాల్గొన్నారు.



ఆరుద్ర చిత్రపటానికి నివాళులర్పిస్తున్న విజయలక్ష్మి తదితరులు



ఆరుద్ర చిత్రపటానికి నివాళులర్పిస్తున్న తోరాటి వసంతరావు తదితరులు

జన సాహితీ సృజనకారుడు ఆరుద్ర

కడియం: సామాన్య జనాన్ని చైతన్యం చేసే సాహిత్యాన్ని సృజించిన కవి ఆరుద్ర అని చెళ్లపిళ్ల వేంకట శాస్త్రి కళాసేవా సమితి ప్రధాన కార్యదర్శి చిలుకూరి శ్రీనివాసరావు అన్నారు. ప్రజాకవి ఆరుద్ర అనే భాగవతుల సదాశివ శంకర శాస్త్రి శతజయంతి ఉత్సవాలు ఆదివారం కడియంలో చెళ్లపిళ్ల కళా సమితి అధ్యక్షుడు అడపా సుబ్రహ్మణ్యం నేతృత్వంలో ఘనంగా జరిగాయి. సమితి గౌరవాధ్యక్షుడు ప్రముఖ న్యాయవాది తోరాటి వసంతరావు ఆరుద్ర చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. చిలుకూరి మాట్లాడుతూ తెలుగు సాహిత్యానికి, తెలుగు సినిమాలకు మాటలు, పాటల రచనల ద్వారా ఆరుద్ర చేసిన సేవలు అజరామరం అన్నారు. తోరాటి మాట్లాడుతూ ఆరుద్ర అరసం ఏర్పాటుకు ఆరంభ సభ్యులు మాత్రమే కాకుండా తెలుగు నాటకాలు, నాటికలు పాటలు, కవితలు, పద్యాల రూపంలో ఎన్నో రచనలు చేసి తెలుగు సాహిత్యాన్ని సుసంపన్నం చేసిన వారిలో ఆరుద్ర ఒకరు అన్నారు. తెలుగు సాహిత్యంపై లోతైన పరిశోధన చేయడమే కాకుండా ఇంగ్లిషు, హిందీ, తమిళం నుంచి కూడా ఎన్నో రచనలను తెలుగులోకి అనువదించిన బహుముఖీన భాషా సాహితీవేత్త ఆరుద్రని కార్యక్రమంలో పాల్గొన్న కోనసీమ జిల్లా అరసం అధ్యక్షుడు గండి స్వామి ప్రసాద్ అన్నారు. యూటీఎఫ్ నాయకులు ఉంగరాల భద్రరావు, చెళ్లపిళ్ల కమిటీ సభ్యులు బొర్రా రామకృష్ణ, రాజేష్, కడియం చర్ల కోటి, రేలంగి శ్రీనివాస్, కిషోర్ పాల్గొన్నారు.

గ్రామాభివృద్ధికి శంభాజీరావు జీవితం అంకితం

మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు వేణు



శంబాజీరావుకు నివాళులర్పిస్తున్న వేణు

రాజమహేంద్రవరం రూరల్: బొమ్మూరు గ్రామాభివృద్ధే తన జీవిత ఆశయంగా మాజీ సర్పంచ్ మద్దిపోటి శంభాజీరావు కృషిచేశారని మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ కొనియాడారు. ఆదివారం ఆయన బొమ్మూరులోని శంబాజీరావు భార్య మాజీ సర్పంచ్ గంగాభవానీ, కుమారుడు చంద్రమౌళి, కుటుంబ సభ్యులను పరామర్శించారు. శంబాజీరావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తాను జిల్లా పరిషత్ చైర్మన్‌గా ఉన్న సమయంలో మాజీమంత్రి జక్కంపూడి రామ్మోహనరావు సిఫార్సుతో బొమ్మూరు గ్రామంనకు శంభాజీరావు లక్షలాదిరూపాయలు మంజూరు చేయించుకుని గ్రామాభివృద్ధికి విశేషకృషి చేశారన్నారు. ఏపీగ్రీనింగ్ అండ్ బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ చందన నాగేశ్వర్, జిల్లా కాంగ్రెస్ పార్టీఅధ్యక్షుడు టికె.విశ్వేశ్వరరెడ్డి, మాజీ సర్పంచ్ నిమ్మలపూడి రామకృష్ణ, బొప్పన చినరాజు శంబాజీరావు చిత్రపటానికి నివాళులర్పించారు.

ఓ బొజ్జ గణపయ్యా.. నీ బంటు నేనయ్యా



రాజవోలు గ్రామంలో చెరువులో నిమజ్జనం చేసేందుకు వినాయకుడిని తీసుకువెళ్తున్న కమిటీ సభ్యులు



విద్యార్థులకు పుస్తకాలు ,పెన్నులు పంపిణీ చేస్తున్న చందన నాగేశ్వర్. చిత్రంలో రుడా మాజీ చైర్‌పర్సన్ షర్మిలారెడ్డి



సరస్వతీ పూజలో పాల్గొన్న విద్యార్థులు

- భక్తి శ్రద్ధలతో వినాయకుడికి పూజలు
- పలుచోట్ల సందడిగా నిమజ్జనాలు
- భారీగా అన్న సమారాధనలు

రాజమహేంద్రవరం రూరల్: వినాయన నవరాత్రుల్లో భాగంగా ఐదవరోజు ఆదివారం మండలంలోని పలు గ్రామాల్లో ఏర్పాటు చేసిన గణేష్ మండపాల వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. పలు గ్రామాల్లో వినాయక మండపాల్లోని విగ్రహాలను డప్పు వాయిద్యాలతో, బాణసంచా కాల్పులతో వీధుల్లో ఊరేగించి గ్రామాల్లోని చెరువుల్లోను, గోదావరికి దగ్గరగా ఉన్న రాజమహేంద్రవరంలో నిమజ్జనం చేశారు. ఆదివారం సెలవు దినం కావడంతో అపార్టుమెంట్‌లలోను, గ్రామవీధుల్లో ఏర్పాటు చేసిన బొజ్జగణపయ్యలను నిమజ్జనం చేశారు. బొమ్మూరు నేతాజీనగర్ బృందావనకాలనీలో శ్రీ వరసిద్ధి వినాయకస్వామి సహిత శ్రీ వేణుగోపాల స్వామి, శ్రీ సంతాన సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో ఏర్పాటు చేసిన వరసిద్ధి వినాయక మండపంలోని 14వ నవరాత్రి ఉత్సవాలలో భాగంగా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో, భక్తుల సహకారంతో అన్నసమారాధన నిర్వహించారు. హుకుంపేట కార్తికేయనగర్‌లో ఏర్పాటు చేసిన వినాయక మండపంలో ఆదివారం రాత్రి కమిటీ నిర్వాహకులు విద్యార్థులతో సరస్వతీ పూజ నిర్వహించారు.



హుకుంపేట కార్తికేయనగర్‌లో సరస్వతీ పూజ చేస్తున్న విద్యార్థులు

ఘనంగా సరస్వతీ పూజ

ధవళేశ్వరం: ధవళేశ్వరం మెండా వారి వీధిలో ఏర్పాటు చేసిన వినాయక పందిరి వద్ద ఆదివారం ఉదయం విద్యార్థులతో సరస్వతీ పూజ ఘనంగా నిర్వహించారు. మెండా వారి గణేష్ ఉత్సవ కమిటీ నాయకుడు మెండా రాజేష్ ఆధ్వర్యంలో పూజ కార్యక్రమాలు జరిగాయి. రాష్ట్ర పచ్చదనం, సుందరీకరణ కార్పొరేషన్ మాజీ చైర్మన్ చందన నాగేశ్వర్, మాజీ రుడా చైర్‌పర్సన్ మేడపాటి షర్మిలారెడ్డి స్వామివారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం సరస్వతీ పూజలో పాల్గొన్న విద్యార్థులకు చందన నాగేశ్వర్, మేడపాటి షర్మిలారెడ్డి పెన్నులు, పుస్తకాలు పంపిణీ చేశారు. మాజీ కార్పొరేటర్ రాయుడు సతీష్, రాయుడు రాజవల్లి, పోలిశెట్టి సాయితాతారావు, వైఎస్సార్ సీపీ దివ్యాంగుల విభాగం జిల్లా అధ్యక్షుడు ముత్యాల పోసికుమార్ సరస్వతి పూజలో పాల్గొన్నారు. దాతలు దుడే బాలాజీ పుస్తకాలను, వీణం తేజ పెన్నులను సమర్పించారు. ఉత్సవ కమిటీ నాయకులు వడ్లమూడి కుమార్,మెండా చిన్నబాబు తదితరులు పాల్గొన్నారు.

గోదావరి మరింత ఉధృతం

- ఆందోళన చెందుతున్న ప్రజలు
- అప్రమత్తమైన అధికారులు
- బొబ్బిల్లంక, ములకల్లంకలను పరిశీలించిన తహసీల్దార్

సీతానగరం: అఖండ గోదావరి వరద మరింత ఉధృతంగా ప్రవహిస్తోంది. ఆదివారం బొబ్బిల్లంక, ములకల్లంక మధ్య వరద నీరు పరవళ్లు తొక్కుతోంది. దీంతో బొబ్బిల్లంక, ములకల్లంక ప్రజలు ఆందోళన చెందుతున్నారు. తహసీల్దార్ ఎ.శ్రీనివాస్ బొబ్బిల్లంక రేవు వద్దకు చేరుకుని గోదావరి వరదను పరిశీలించారు. బొబ్బిల్లంక నుంచి బోటుపై ములకల్లంక చేరుకున్నారు. ములకల్లంక వాసుల యోగక్షేమాలు తెలుసుకున్నారు. గోదావరి వరద మరింత ఉధృతం అయితే తొర్రేడు జిల్లా పరిషత్ హైస్కూల్ పునరావాసం కేంద్రం ఏర్పాటు చేశామని అక్కడకు తరలి వెళ్లాలని కోరారు. ములకల్లంకలో పారిశుధ్యంపై ఆరా తీశారు. అదే విధంగా తాగునీటి సమస్య ఏమైనా ఉందా అని అడిగి తెలుసుకున్నారు. వీధుల్లో బ్లీచింగ్ జల్లాలని, పంచాయతీ అందించే నీటిని క్లోరినైజేషన్ చేయాలని పంచాయతీ అధికారులకు సూచించారు. ములకల్లంక, బొబ్బిల్లంకల్లో 24 గంటల వైద్యశిబిరాలను ఉండాలని, మందులు పూర్తి స్థాయిలో అందుబాటులో ఉండేలా చూసుకోవాలని సిబ్బందిని ఆదేశించారు. అనంతరం వారు విలేకరులతో మాట్లాడుతూ ములకల్లంక వాసులను సురక్షిత ప్రాంతాలకు తరలించే ప్రయత్నం చేసినా వాళ్లు పునరావాస కేంద్రాలకు వెళ్లేందుకు అంగీకరించడం లేదన్నారు. గోదావరి వరద మరింత ఉధృతి అయితే వారిని అక్కడ నుంచి తరలిస్తామన్నారు.ఎప్పటికప్పుడు వరద సమాచారం తెలుసుకుని తగు చర్యలు తీసుకుంటున్నామని తహసీల్దార్ శ్రీనివాస తెలిపారు.



బొబ్బిల్లంక - ములకల్లంక మధ్య ఉధృతంగా ప్రవహిస్తున్న గోదావరి

నేడు చాంబర్‌లో జీఎస్టీ స్లాబులపై వివరణ

రాజమహేంద్రవరం సిటీ: రాజమండ్రి ఛాంబర్ ఆఫ్ కామర్స్ భవనంలో సోమవారం సాయంత్రం 4.30 గంటలకు జీఎస్టీ స్లాబులపై వివరించే కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు చాంబర్ అధ్యక్షుడు తవ్వా రాజా, కార్యదర్శి ఆకుల శ్రీనివాస్ ఆదివారం తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్, ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు పాల్గొంటారని తెలిపారు.